## ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన


దేవరకద్రలో కోర్టు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దేవరకద్ర, డిసెంబర్ 24 : నియోజకవర్గ కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో కోర్టు ఏర్పాటు కోసం పురాతన ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. అదేవిధంగా డిగ్రీ కళాశాల భవనానికి ప్రస్తుత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. నియోజకవర్గంలో వందపడకల దవాఖాన తదితర కార్యాలయాలను ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, నాయకులు అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజలు చైతన్యవంతం కావాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 24 : వినియోగదారుల హక్కులపై ప్రజలు చైతన్యవంతం కావాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 'డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు న్యాయం' అనే నినాదంతో ఈ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ బాల లింగయ్య వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, కమిషన్ సభ్యులు, అందించే సేవలు, కేసుల పరిష్కారం తదితర అంశాలపై వివరించారు. తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య సెక్రటరీ కెప్టెన్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ వ్యవస్థలోని మోసాలను పసిగట్టి వాటిపై వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా సత్వర న్యాయం జరిగే అవకాశం ప్రస్తుత డిజిటల్ హియరింగ్ వ్యవస్థలో ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో వెంకటయ్య, జిల్లా తూనికలు కొలత అధికారి రవీందర్, ఫుడ్ సేఫ్టీ కమిషన్ మాజీ సభ్యులు ఆడమ్స్, జగదీశ్ పాల్గొన్నారు.

## శ్రీతేజకు ఎంపీ అరుణ పరామర్శ

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 24 : సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి కోమాలో ఉన్న శ్రీజను ఎంపీ డీకే అరుణ మంగళవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ దవాఖానకు వెళ్లి పరామర్శించారు. దవాఖాన వైద్య సిబ్బందితో ఆమె మాట్లాడి శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఘటన జరిగిన నాటి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ తండ్రి, కుటుంబ సభ్యులు బాబాయితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు కున్సీ పాఠశాల విద్యార్థుల ఎంపిక

కృష్ణ, డిసెంబర్ 24 : ఈనెల 19న నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలో కున్సీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2వ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు తనుజ, మేఘన, నందిని, సనా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. వీరు ఈనెల 27 నుంచి వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ సౌమ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోషి, ఉపాధ్యాయులు నరేందర్, నర్సింహులు, రమేశ్, ఖాషీంఅలీ, ఉషా, స్వామి, భారతి, నాగేశ్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## నాసిరకంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

మరికల్, డిసెంబర్ 24 : మండలంలోని ఇంబ్రా హీలపట్నంలో అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు రూ.3లక్షల మైనర్ రిపేరింగ్ పనులు నాసిరకంగా నిర్వహించారని మాజీ సర్పంచ్ సుజాతరవి కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు నాసిరకంగా చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎంపీవో సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు

మరికల్, డిసెంబర్ 24 : నారాయణ పేట జిల్లా ఎంపీవోల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంఎల్‌ఎన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, ఉపాధ్యక్షుడిగా రామన్న, కోశాధికారిగా వెంకటేశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీడీవో జయరామ్‌నాయక్

సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయరామ్‌నాయక్

నవాబ్‌పేట, డిసెంబర్ 24 : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను పంచాయతీ కార్యదర్శులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో జయరామ్‌నాయక్ సూచించారు. మండలంలోని కాకర్జాలతండా, కిషన్ గూడ గ్రామాల్లో చేపడు తున్న సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్ సర్వే చేపట్టాలని కోరారు. సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

## మహిళల న్యాయ పరిరక్షణకే భరోసా

- జిల్లా కార్యదర్శి ఇందిరా దేవి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఇందిరాదేవి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 24 : మహిళల భద్రత, పిల్లల రక్షణ బాధితులకు న్యాయ పరిరక్షణ అందించడంలో భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా కార్యదర్శి ఇందిరాదేవి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో భరోసా కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా దేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాధితుల సహాయానికి భరోసా కేంద్రాలు ఓ నమ్మకమైన వేదికగా పనిచేస్తున్నాయన్నారు. మహిళ హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా లైంగిక వేధింపులు, గృహహింస, బాలలపై హింసకు గురైన బాధితులకు న్యాయ, వైద్య మానసిక మద్దతు అందించడుతుంది. మహిళలపై జరిగే నేరాలను నివారించడంలో భరోసా కేంద్రం చేసిన కృషి, ప్రస్తుతం అందిస్తున్న సేవల సమీక్ష రాబోయే రోజుల కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. ఈ సమావేశం ద్వారా విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరిచి బాధితుల జీవన ప్రమాణాను పెంచడంలో ముఖ్య మైన నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డీఎంహెచ్‌వో కృష్ణ, సీడ బ్ల్యూసీ చైర్మన్ నయూ మద్దీన్, జేజేబీ చైర్‌పర్సన్ గ్రేస్, ఆర్‌ఎం శ్రీషా, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రమణారెడ్డి, ఆర్‌ఎంవో జేరినా, సీఐ,ఎస్సైలు, అధికారులు ఉన్నారు.

## ప్రతిభ ఆధారంగానే పీయూ క్రికెట్ జట్టు ఎంపిక

- పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప

ఆల్‌ఇండియా పోటీలకు ఎంపికైన క్రికెట్ జట్టుతో పీయూ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 24 : సౌత్‌జోన్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే పీయూ క్రికెట్ పురుషుల జట్టు ఎంపిక ప్రతిభ కొలమానంగా పూర్తి పారదర్శకంగా జరిగిందని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప తెలిపారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీ క్రికెట్ (పురుషుల విభాగం) జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ హాజరై బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ ఆధారంగా మొత్తం 22 మందిని ఎంపిక చేయగా వారిలో 16 మంది మెయిన్ టీం, ఆరు గురు స్టాండ్‌బై బాయ్స్‌గా సెలెక్ట్ చేశారు. ఎంపికైన క్రీడాకారులను రిజిస్ట్రార్ అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడులోని యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరిగే సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పీయూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీటూ వీసీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కుమారస్వామి, క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేశ్, పీడీ డాక్టర్ సత్య భక్కర్‌రెడ్డి, అబ్దుల్లా పాల్గొన్నారు.

## యాదవులకు అండగా ఉంటా

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, డిసెంబర్ 24 : యాదవులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో అఖిల భారత యాదవ మహాసభ పట్టణాధ్యక్షుడు నర్సిం హయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తులు ఒక్కటే జీవనాధారం కాకుండా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలంటే తప్పక ఏదైనా ఒక నైపుణ్యాన్ని మన పిల్లలకు నేర్పాలన్నారు. వారికి మంచి విద్యను అందించాలని కోరారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అఖిల భారత యాదవ మహాసభ నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ శాంతన్న యాదవ్, యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట నర్సయ్య యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రవికుమార్ యాదవ్, టీఎన్‌జీవో జిల్లా ఉపాధ్యక్షుడు బాలుయాదవ్, టీపీసీసీ, డీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రీ, వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల డిమాండ్
- అంబేద్కర్ విగ్రహాలకు వినతులు
- పాలమూరులో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాలు

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలంటూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 24 : తమ డిమాండ్ల సాధనలో భాగంగా చేపట్టిన సమ్మెను రోజు రోజుకు సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు మరింత ఉధృతం చేస్తున్నారు. మంగళవారం వారు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట.. ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం అంబేద్కర్ కూడలిలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వినతిపత్రాలు సమర్పించారు. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకు నేందుకు మమ్మల్ని మభ్యపెట్టి శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా వైహొద్దీన్, కోశాధికారి ఇక్రమ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, నాయకులు మొగులయ్య, భాస్కర్, ఉదయ్, చెన్నయ్య, మాధవి, సుజాత, జ్యోతి, కవిత, మమత, హరిత, ఇందిరమ్మ, గంగమ్మ, గీత, అమృత, ఇందిర, కలీం, అన్వర్‌పాషా, జ్ఞానేశ్వరీ, మాధవి, పావని పాల్గొన్నారు.

## జడ్చర్ల మున్సిఫ్ కోర్టులో ఈ సేవ కేంద్రం ఏర్పాటు


ఈ సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఏడీజే కల్యాణ్‌చక్రవర్తి

జడ్చర్ల, డిసెంబర్ 24 : జడ్చర్ల మున్సిఫ్ కోర్టులో ఈ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈఈ సేవా కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఏడీజే కోర్టు న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాన్ని వర్చువల్‌గా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ఈసేవ కేంద్రం ద్వారా కక్షిదారులు సులభంగా వారి కేసుల విషయాలను తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా కేసుల వివరాలుగా స్టాగ్‌లు తెలుసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 కేంద్రాలు ఈరోజు వర్చువల్‌గా హైకోర్టు వారి ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్చర్ల కోర్టు అదనపు జడ్జి ముద్దాసిర్ మాట్లాడుతూ న్యాయవాదులకు కక్షిదారులకు ఈ సేవ కేంద్రం ద్వారా కక్షిదారులకు మరింత సేవచేసే వీలు అవుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఆదిరెడ్డి, న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, కరీం, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రావు, రాములు, విశ్వేశ్వర్, తిరుపతి, ప్రశాంత్, రమేశ్, పాండు, అశోక్, మాలిక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారికి ఆర్థిక సాయం అందజేత

చెక్కు అందజేస్తున్న రెడ్డి సేవా సమితి సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 24 : మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం దాసరిపల్లికి చెందిన చిన్నారి తేజశ్వినిరెడ్డి హైదరాబాద్ కిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతుంది. వైద్య ఖర్చు నిమిత్తం మంగళవారం పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారి తండ్రి శ్రీకాంత్‌రెడ్డికు రూ.2.50 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, సురేందర్ రెడ్డి, కొటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

## సాధిక్ అలీ కుటుంబానికి..

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 24 : జిల్లా కేంద్రానికి చెందిన సాఫ్ట్ బాల్ కోచ్ సాధిక్ అలీ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఆ సంఘం సభ్యులు మంగళవారం సాధిక్ అలీ కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అర్థిక సాయం అందజేసిన వారిలో డీవైఎస్‌వో శ్రీనివాస్, అశ్వధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో..

జడ్చర్ల, డిసెంబర్ 24 : జడ్చర్ల మున్సిపాలిటీలో ఎలక్షనీయన్‌గా పనిచేస్తున్న తప్పెట కృష్ణయ్య సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది మంగళవారం కృష్ణయ్య ఇంటికి చేరుకొని ఆయన పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు గానూ రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆమె వెంట కౌన్సిలర్లు జ్యోతికృష్ణారెడ్డి, శశికిరణ్, లత, నర్సింహులు, కృష్ణారెడ్డి, జగదీశ్ ఉన్నారు.

## అమర గాయకుడికి ఘన నివాళి

పాలమూరు, డిసెంబర్ 24 : జిల్లా కేంద్రంలోని ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో మంగళవారం పద్మశ్రీ మహమ్మద్‌రఫీ అమర గాయకుడి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణ్, నర్సింహులు, భాస్కర్, సంస్థ ప్రతినిధులు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

వినియోగదారుల దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 24 : పాలమూరు యూనివర్సిటీ అకాడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ నాగసుధ వినియోగదారుల హక్కులు, వ్యక్తిగత ప్రయోజనాల పరిరక్షణపై వివరించారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎస్ఎన్ అర్జున్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపారుల దోపిడీ, మోసపూరిత కాల్స్, ప్రకటనలను గుర్తించడంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జావీద్‌మహ్మద్‌ఖాన్, అరుంధతీరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట, డిసెంబర్ 24 : విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీం పోలీసులు తెలిపారు. అపరిచితుల వ్యక్తులతో ఎలాంటి ఇబ్బందులు వచ్చిన టీసేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని షీటీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య తెలిపారు. మంగళవారం నారాయణపేట మండలం సింగారం గేట్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులు ఎవరైనా వేధింపులకు గురైతే షీ టీం పోలీసులకు సెల్ నెంబర్ 8712670 398కి లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌సీ ద్వారా విద్యార్థులకు లాభం

మరికల్, డిసెంబర్ 24 : విద్యార్థులకు పాఠశాలల్లో స్టూడెంట్ లేడ్ కానిఫిరెన్స్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో లాభం చేకురుతుందని చిన్నచింతకుంట ఎంఈవో మురళీకృష్ణ అన్నారు. మంగళవారం లాల్‌కోట క్రాస్ రోడ్డులోని గౌతమి స్కూల్‌లో ఎస్ఎల్‌సీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గణితం, సాంఘిక శాస్త్రం, సామాన్య పాఠ్యాంశాలను సులువుగా నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి అదృశ్యం

అఖిల్ (ఫైల్)

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 24 : చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన దశరథ్ ఆరు సంవత్సరాల కుమారుడు అఖిల్ సోమవారం మధ్యాహ్నం తప్పిపోయినట్లు చింతకుంట ఎస్సై శేఖర్ తెలిపారు. సోమవారం అఖిల్ తమ ఇంటి ముందు ఆడుకుంటు ఉండగా కొంత సమయం తర్వాత బాలుడిని ఇంట్లోకి పిలిచేందుకు చూడగా కని పించలేదన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా దొరకలేదని, తప్పిపోయిన సమయంలో బాలుడు ఆకుపచ్చ చొక్క, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని మంగళవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ధన్వాడ, డిసెంబర్ 24 : ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 15 రోజులుగా సమ్మే చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల నాయకులు గౌని శ్రీనివాసులు, సుధీర్‌కుమార్ రావు, సత్యానారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమగ్ర సర్వ శిక్షాఅభియాన్ ఉద్యోగులు సమ్మే చేస్తుండడంతో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేకపోవడంతో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్నా అధికారులు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఫతేపూర్ మైసమ్మ ఆలయ చైర్మన్‌గా జగన్‌మోహన్‌రెడ్డి

- రేపు ప్రమాణ స్వీకారోత్సవం

జగన్‌మోహన్‌రెడ్డి

నవాబ్‌పేట, డిసెంబర్ 24 : మండలంలోని ఫతేపూర్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మరో 13 మందిని పాలకవర్గ సభ్యులుగా నియమిస్తూ ఎండోమెంట్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా జగన్‌మోహన్ రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా పాశం రామస్వామి, మల్లయ్య, మేఘ్యా, శివరాజు, రవీందర్, ఆంజనేయులు, శాంతయ్య, రమాదేవి, బాలకిష్టయ్య, బాలస్వామి, నర్సింహులు, రవి, రాంచంద్రయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికైన పాలకవర్గ సభ్యులు ఈనెల 26వ తేదీన మైసమ్మ ఆలయ ఆవరణలో ఉదయం 10గంటలకు పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారని ఈవో మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## చెరువులో పడి యువకుడి మృతి

నవీన్‌కుమార్

హన్వాడ, డిసెంబర్ 24 : చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు హన్వాడ గ్రామానికి చెందిన బైకని రాజు కుమారుడు నవీన్ కుమార్(16)ఈనెల 22వ తేదీన తెల్లవారుజామున ఇతర వివిధ దినపత్రికలు వేయడానికి వెళ్లారు. మళ్లీ ఇంటికి తిరిగి రాక పోకడంతో నాటి నుంచి నేటి వరకు కుటుంబ సభ్యులతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి వెతికినా ఆచూకీ తెలియలేదు. కాగా మంగళవారం తెల్లవారుజామున హన్వాడ చెరువులో నవీన్‌కుమార్ మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చెరుకొని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం జిల్లా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భూత్పూర్, డిసెంబర్ 24